# ఆమె ఎవరు?

సాయంకాలం ఆరుగంటలయింది. అరుణ సంధ్య కాంతుల్లో చల్లని రోజ్జగాలితో పాటు సన్నని వర్షపుజల్లుకూడా పడుతోంది. అప్పుడోసారీ అక్కడోసారీ, మెరిసే మెరుపులకీ శ్రీచూర్ణపు ఆకాశం, బురదనీరు చేరిన కాలవ ప్రవాహంలా కనపడుతోంది. ఎర్రని రంగుమీద, జరీగళ్ళువున్న గద్వాల చీర కట్టుకొని, సిగపిన్నులు వూడి, మెడమీదకు సిగ జారుతోంటే, కళ్ళు పెద్దవిచేసి, చూస్తూ వర్షపుచినుకుల్లో తడుస్తో రోడ్డుమీద ముందుకు పరిగెట్టుతోన్న ఒక ముప్పయి సంవత్సరాల యువతినిచూసి, రోడ్డుమీద నడుస్తోన్న జనం అంతా అద్భుతపడ్డారు! ఆమె ఖరీదయిన బట్టలూ, ఆబట్టలని ఆమె ధరించిన తీరువా చూస్తే ఆమె ఒక వున్నతవంశీకురాలిలా కనపడుతోంది. ఆమె ఎక్కడా ఆగలేదు. తాను వర్షంలో తడుస్తూనాన్ననన్న ధ్యాసే లేకుండగా ఏదో దూరంలో తన గమ్యం కనపడుతోందన్న నిశ్చయంతో ఆమె పరిగెట్టి వెళ్ళిపోతోంది. ఆమెని అనుసరిస్తో పొడుగ్గా పచ్చగా, దృఢంగా వున్న ఒక యువకుడు స్కూటర్ మీద వెళ్ళుతున్నాడు. ఆమె వెనక్కితిరిగన్నా చూడకుండా ముందుకు వెళ్ళిపోతోంది. ఆమె ఎవరు? ఎందుకలా పరిగెట్టుతోంది? గొప్పింటిఆమెలా వున్న ఆమెకి చలిలో, వర్షంలో తడుస్తో పరిగెట్టాల్సినంత విపత్తు ఏమివచ్చింది?

తెల్లని పల్చని వాయిల్ చీర, అంతకన్న తెల్లగా మెత్తగా వంటికి అతుక్కుపోయివున్న జాకెట్ ధరించి, నల్లని

పొడుగాటిజుత్తు, భుజంమీంచి నడుం క్రిందవరకు జారుతోంటే,
రోడ్డుమీదకు రాబోతూన్న ఆ రేళ్ళ పాలబుగ్గల పసిడికూనని
లోపలికి లాక్కోబోతోన్న ఆ యువతిని చూసి, ఎదురింటి
గుమ్మంలో నించున్న సరళ ఆయువతియొక్క సౌందర్యానికి
అద్భుత్త పడింది. ఆ ఎదురింటి పాప సరళకి ఆరునెల్లనుంచీ
బాగా మాలిమిఅయ్యింది. ఆపాపని, తన స్వంతకూతురిలా
అభిమానిస్తూన్న సరళ ఆ పాప తల్లిని తొలిసారగా ఆరోజే
చూసింది. తన కూతుర్ని అంత ఆపేక్షగా చూస్తూన్న సరళని
చూసికూడా స్నేహపూర్వకమైన హాసమైనా వెలువరచలేదు
ఆ సౌందర్యవతి. దానికి కొంచెం ఖేదపడింది సరళ. ఆమె
ముఖంలో మందహాసం కనుపడుతుందేమో, తను పల్కరించి
స్నేహం చేసుకుందామనుకున్న సరళకోరిక కోరికగానే మిగిలి
పోయింది. అప్పుడేకాదు ఆ తర్వాత గుమ్మంలో నాలుగ
యిదుసార్లు తారస పడ్డప్పుడుకూడా. ఆయువతి సరళపట్ల ఉదా
సీనతే వహించింది. సరళ ఎంతమందో సౌందర్యవతులని తెలి
సున్నది. కాని ఆ ఎదురింటి యువతిలోవున్న నాజూకుతనమూ,
హుందాతనమూ ఎ వ రి లో నూ ఆమెకి కన్పించలేదు.
అరచేతివెడల్పునవున్న ఆమె మెరిసే పాలరాతిలాంటి
నెన్నుదురుమీద కుంకుమ లేక పోవటం, అహంభావికంగా
కన్పించేది. కాని వైధవ్యంలోని నిస్తేజం కన్పించేద
కాదు. ఆమె అలంకరణకూడా అల్లా తెల్లని బట్టల్లోనే
వుండేది. జుత్తు ఎ ప్పు డూ తలంటుకున్నదానిలా విర

జోసుకునే వుండేది. ఆమె పొడుగాటిజుత్తు మోకాలి మడతలు దాటి క్రిందకు జారుతోంటే ఒక రాజకన్యలా ఠీవిగా నడిచేది. ఆమె హుందాతనం చూస్తే, సరళకి ముచ్చట వేసేది. ఆ పాపతో సరళ పరిచయంకూడా అకస్మాత్తుగా జరిగింది. సరళ మామూలుగా ఒకరోజు వీధిగుమ్మంలో నించుంది. పాప ఎదుటి గుమ్మంలోంచి వీధరుగుమీదకు వచ్చి దారిని పోతున్న బిస్కట్లఅబ్బిని "వొరే అబ్బి!" అని కేక వేసింది. నాలుగేళ్ళగా తెలుగుముఖాలకి, తెలుగుభాషకి ముఖం వాచిపోయి వున్న "సరళ" ఆ పాపవేపు శరీరంఅంతా కళ్ళుచేసుకు చూసింది. బిస్కట్లఅబ్బి వచ్చి గుమ్మంముందు నిలుచున్నాడు. ఆపాప "అమ్మా అమ్మా" అంటూ లోపలికి పరిగెట్టి మళ్ళి వెంటనే బిక్కముఖంతో బయటకువొచ్చి "డబుల్లేవులే వెళ్ళిపో!" అంది. సరళకి జాలివేసింది. "ఏయ్ అబ్బిఇల్లారా!' అంది. ఈసారి పాప కళ్ళు గుండ్రంగాచేసి సరళవేపు చూసింది. "సరళ డబ్బులిచ్చి బిస్కట్లు కొంది. పాపకేసిచూసి నవ్వి "మాట" అంది. పాప కొంచెం సంతోషం పొందింది. "పాపా! మాట రా!" అంది సరళ. పాప లోపలిక పరిగెట్టి తల్లితో చెప్పింది. ఎదురింటావిడ పిలుస్తోందని "ఫర్వాలేదు" వెళ్లు" అంది తల్లి. పాప సరళదగ్గరకు వచ్చింది. సరళ పాపని ఎత్తుకుని బిస్కట్లు ఇచ్చి "నీ పేరేవరమ్మా!" అంది.

"చిన్ని!" ముద్దుగా అంది పాప.

"మీ అమ్మపేరు!"

"అమ్మ!" అంది పాప.

"నాన్నగారిపేరు?" అంది సరళ.

'నాన్నా ఎవరు! అంది, చిన్నీ. సరళ తనతప్పు గ్రహించుకుంది. చిన్నముఖం చూచింది. ఆ పాప ముఖం చూస్తుంటే, సరళకి ఏదో తెలియని ఆత్మీయత కలిగింది. ఎన్ని రోజులుగానో ఆ పాపని ఎరుగున్నట్లుగా భావం కలిగింది. చిన్నీ ముఖం కళ్ళూ, నోరూ, బుగ్గలూ, అన్నీ చూసినట్లుగానే వుంది సరళకి. కాని ఎక్కడ చూసిందో జ్ఞాపకం రావటం లేగు. చప్పున చిన్నీ రెండుచెంపలూ, గాఢంగా ముద్దుపెట్టుకుని,

'పోనీ ఇంకా మీ ఇంట్లో ఎవరెవరుంటారమ్మా' లాలనగా అడిగింది.

'మాఇంట్లో నేనూ, మా అమ్మా! బస్సెక్కి వెళ్లితే, తాతయ్య వుంటాడు. ఎప్పుడన్నా బాబాయి వొత్తాడు, బిస్కట్లుకొంటాడు. పాఠం అప్పచెప్పినట్లు చెప్పింది చిన్నీ, సరళమనస్సు ఆర్ద్రిత పొందింది.

'నేను నీకు పిన్నిని అవుతాను, రోజూ వస్తావా! నీకు మంచిమంచి గౌనులూ, బోలెడు బిస్కట్లు కొనిఇస్తాను,' అంది సరళ.

'అమ్మ వెళ్ళమంటే వత్తాను' అంది చిన్నీ, క్రమంగా చిన్నీ తల్లిపేరు బాజీ అనీ, మిషన్‌కుట్టువల్ల జీవిక నడుపుకుంటుందనీ, వివరాలు సేకరించకలిగింది సరళ. రెండుమూడు

సార్లు తనజాకెట్లూ, అండర్ వేర్లూ, కుట్టమనీ గుడ్డలు పని మనిషి చేతికిచ్చి పంపించింది సరళ. 'బాజీ' తను రెడీమేడ్ దుస్తుల షాపువాళ్ళకి కంట్రాక్టుప్రకారం కుట్టి ఇస్తుందనీ, చిన్నచిన్న పనులు వొప్పుకొంకుకు తనకు తీరదనీ చెప్పి, సరళ బట్టలు కుట్టిపెట్టటానికి నిరాకరించింది. ఆవిధంగా సాయపడదా మనుకున్న సరళకోరిక కూడా కోరికగానే మిగిలిపోయింది.

ఒకరోజు రాజేంద్రఆఫీస్‌నించి ఇంటికివచ్చి హాలులోనికి అడుగుపెడుతూనే, సరళ వొడిలో బుద్ధిగా కూర్చుని, యాపిల్ తింటూ, ముద్దిగా కబుర్లు చెప్తూన్న చిన్నిని చూసి, తృళ్లిపడ్డాడు. భర్త ఆగమనంతో, ముఖమంతా వెన్నెలకాంతి నింపుకున్న సరళ చిన్నిని చిన్నకుషన్‌లో కూర్చోపెట్టి, గ్లాసూ, బిస్కట్లు ప్లేటూ టీపాయ్ మీద పెట్టి, భర్తకూర్చున్న 'సోఫా'వద్దకు వచ్చింది. 'చిన్ని' కేసి దీర్ఘంగా చూసాడు రాజేంద్ర. చిన్ని బుల్లిపెదాలు అదురుతూంటే, నెమ్మదిగా 'బాబాయ్' అని గొణిగింది. రాజేంద్ర సరళకేసి చూసాడు. సరళ ముఖమంతా మాతృత్వపుమమకారం వెలిగిపోగా. చిన్నివెంపు మురిపెంగా చూసింది. ఒకక్షణం లోతుగా సరళవెంపుచూసి రాజేంద్ర కనుబొమ్మలు ముడివైచి కోపంగా,

'దీన్నెక్కడ సంపాదించావు?' అన్నాడు. సరళ ప్రశాంతంగా నవ్వింది.

ఎదురింటిలో కాపరానికివొచ్చేరు' అంది.

'ఎవరు?' కనుబొమ్మ ముడివిప్పకుండానే అన్నాడు.

'ఈ పాప వాళ్ళమ్మా!'

'మరినాన్నా!'

"నాన్న లేడట. ఆమె రెడీమేడ్ దుస్తులషాపువాళ్ళకి మిషను కుట్టి జీవిస్తోందిట" అంది.

"నాన్న ఎక్కడో రోడ్లూడ్చి జీవిస్తోంటాడు. ఇల్లా వూరూ పేరూ లేని గతిమాలిన మూకని చేర్చవద్దని నీ కెన్ని సార్లు చెప్పాను!" అన్నాడు రాజేంద్రం. సరళ నెమ్మదిగా అన్నది.

"ఇంత పెద్దఇంటిలో నౌకర్లతో ఎంతసేపని కాలం గడపనూ? ఇరుగూ పొరుగూతో కాలక్షేపం చేద్దామంటే వాళ్ళ భాష నాకు తెలియదుకదా! ఇంత మహాపట్నంలో మన తెలుగువాళ్ళు వున్నారో లేదో నాకు తెలియనే తెలియదు. దేవుడిచ్చిన వరంలా ఈపాప నాకు లభించింది. ఈ కాస్త ఆనందం నాకు దూరం చేసుకోలేను.'

రాజేంద్ర బిస్కట్లు ప్లేటు విసిరిపారేసి కోపంగా లేచి నించున్నాడు.

"నిన్నేదో ఖైదులో పెట్టినట్లు మాట్లాడతావేమిటి? ఇరవయినాలుగు గంటలూ, అడ్డమైనవాళ్ళతోటీ హస్కు కొట్టితేకాని కాలం గడవదూ? మంచి పుస్తకం నీడన మన సెంతో చల్లన' అని మంచి పుస్తకాలు కొనుక్కొని చదువు

కోకూడదూ! అయినా నీకేం ధనవంతురాలివి! నామాట వింటే నీవ్యక్తిత్వానికి చిన్నతనం ధనవంతురాల్ని ప్రేమించి పెళ్ళాడడం నాదే తప్పు!" విసవిసా బయటకు వెళ్ళిపోయాడు రాజేంద్ర సరళ విస్తుపోయింది. తను అన్నదానిలో తప్పేమిటో అతనికి అంతకోపం వచ్చేయిటం దేనికో సరళకి మెదడు వేడెక్కిపోయినా అర్థంకాలేదు. చిన్నీ ముఖంకేసి సూసింది. "యాపిల్‌పళ్ళలాంటి బుగ్గలతో ముద్దులు మూటగట్టేట్లున్న చిన్నీ గతిలేని పిల్లలా అతనికెందుకు కన్పడిందీ? నిజానికి సరళ గొప్పింటి అమ్మాయే లేకలేక తల్లికీ తండ్రికీ ఒక్కతే కూతురుగా జన్మించిన సరళకి చిన్నప్పట్నించీ కావాలనుకున్న ప్రతీ కోరికా, నెరవేరటంలో ఆశ్చర్యం ఏమీలేదు. పెద్ద జమీలాంటి ఆస్తికివారసురాలయిన సరళకి చేస్తోన్న వుద్యోగంతప్ప చిల్లికానీ ఆస్తి ఏమీలేని రాజేంద్ర ఆకర్షణీయంగా, ఆరాధ్య దైవంగా కనపడ్డాడు; అతన్ని మనసారా ప్రేమించింది. దైవంగా భావించి, పూజించింది. తన్నీనాడు మనస్సుతో ప్రేమించి పెళ్ళాడిన రాజేంద్రకి ఈనాడు చిన్నీమూలంగా తమ మధ్యవున్న అంతస్థుల అంతరం కన్పించింది. తనుచెప్పిన మాట వినని అవ్యక్తురాలిలా భావించి కోపగించాడు. బాధగా వ్యథగా ఆమె కళ్ళు నిండుకున్నాయి.

"బాబాయ్ వెళ్ళిపోయారా పిన్నీ!" ముద్దుగా అంది చిన్నీ

"అవునమ్మా!" అంది సరళ.

'బాబాయికి కోపమెక్కువ!' తెలుసున్నదానిలా అంది చిన్ని.

పసిపిల్లకూడ తన భర్త అహంకారం గ్రహించగలిగి నందుకు అవమానపడింది సరళ.

"వెళ్ళిపోతా పిన్నీ!" అంది చిన్నీ జాలిగా.

'మరి రావా?' బాధగా అంది సరళ.

'బాబాయి లేనప్పు డొస్తాలే!' సముదాయింపుగా అన్న చిన్నీని, గాఢంగా హృదయానికి హత్తుకున ముద్దు పెట్టుకుంది సరళ.

'డాక్టర్ జీవా వస్తున్నాడట! అన్న రాజేంద్ర మాట లకే ముఖమెత్తి చూసింది సరళ.

"నా చిన్నప్పటి స్నేహితుడు బహుశా ఒక వారం రోజులు వుండొచ్చును. ఉత్తి వాగుడుకాయ. వాడి మాట లకే నువ్వేమీ కష్టపెట్టుకోకు" అన్నాడు రాజేంద్ర సరళ మృదువుగా నవ్వింది. 'ఆయనకి నేనంటే ఎంత అపేక్ష! ఆత్మీయుడైన స్నేహితుని మాటలకి తాను చింతపడుతుం దేమో అని బాధ పొందుతున్నారు" అనుకొని నవ్వుకొంది. డాక్టర్ జీవా రాకతో ఇల్లంతా ఒకటే గొడవగొడవలయిపోయింది. జీవానోరుఒక్క-క్షణంవూరుకునేదికాదు. వాళ్ళకాలేజీరోజుల్లోని రొమాంటిక్సు కథలన్నీ చెప్పేవాడు. మధ్యమధ్య "ఐయామ్ వెరీసారీ భైయ్యా! వదినమాట మర్చిపోయాను' అంటూండే వాడు. 'పరవాలేదులెండి' అని నవ్వుతూ సరళ కూడా ఆ వుత్సాహస్రవంతిలో తాను కూడా ఒక చిన్న అలలా కలిసి పోయేది. రాజేంద్ర ఆఫీస్ కెళ్ళబోతూ,

'అరేబాప్! నేను వచ్చేసరికి బహుశా సాయంకాలం నాలుగు గంటలవుతుందీ. అందాకా యూమస్ట్ టేక్ కంపల్సరీ రెస్ట్! అట్లే వాగావంటే, మాధనలక్ష్మి హడలిపోయి పారి పోతుంది' అన్నాడు.

జీవా భళ్ళున నవ్వాడు.

'నీమాత్రం స్త్రీలని ఎంటర్‌టయిన్ చెయ్యటం నాకు తెలియదనుకున్నావా' అన్నాడు.

రాజేంద్ర స్కూటర్ వెళ్ళిన చప్పుడవగానే అలవాటు ప్రకారం చిన్ని వొచ్చింది. సరళ ఎదురువెళ్ళి చిన్నిని ఎత్తుకొని లోపలికి తీసుకవచ్చింది చిన్నిని చూస్తూనే పైప్ వెలిగించు కుంటున్నవాడల్లా జీవా ఆ పైపిని నేలమీదకు గిరవాటు వేసాడు' ఒక్కవుదుటున లేచి,

'వాట్ ఎ వండర్! ఎవరీపిల్ల? అన్నాడు.

'ఎదురింట్లో వుంటున్నారు.' సరళ చెప్పింది.

'పదండి! అయితే!' గుమ్మంవెంపు నడిచాడు. సరళ సంకోచపడింది. ఇన్నిరోజులుగా భాజీ తనని చూస్తూవున్నా మాటకైనా పలకరించలేదు. తనతో స్నేహాన్ని వాంఛించని ఆమె ఇంటికి పరాయిపురుషుణ్ని తీసుకుని ఏమనివెళ్తుందీ!

'నాకామెతో అట్టె పరిచయంలేదండీ!' అన్నది.

'ఆ పరిచయమేదో, నేను చేస్తానులెండి పదండి. నా సందేహం నివృత్తి చేసుకోందే నేను నిలవలేను.' జీవా వడిగా ఎదురింటివేపు నడిచాడు. విధిలేక సరళ 'చిన్ని'ని ఎత్తుకునే అనుసరించింది.

సోఫామీద వొంపుగాపడుకుని ఏదో మాగజైన్ చూస్తూన్న 'బాజీ' వీళ్లనుచూసి వులిక్కిపడి లేచినించుంది. ఆమెనిచూస్తే బట్టలుకుట్టి జీవిక నడుపుకుంటున్న దానిమల్లే లేదు. ఒకమహారాజు పోషణలో వుండే రూపజీవిలావుంది.

'నువ్వేంఅన్నమాట!' ఈ సడింపుగా అన్నాడు జీవా.

బాజీ మాట్లాడలేదు. కనీసం కూర్చోమనైనా అనలేదు. 'చిన్నీ' మటుకు వూరుకోలేదు! సరళ మెడ తన చిన్న చేతు లతో గట్టిగా కౌగలించుకుని,

'పిన్నీ! అమ్మ' అంది.

'నమస్కారం!' సరళ మృదువుగా అంది. బాజీ ప్రత్యభివాదంకూడా చెయ్యలేదు.

'ఆమె ఎవరుజీవా?' జీవాని అడిగింది 'బాజీ' సరళ విస్తుబోయింది. తనతో ఆమె ఎందుకని మాటాడదు! తనేం చేసిందని తనపట్ల ఆమెకి ఇంత విముఖత?

జీవా కోపంతో వూగిపోతున్నాడు.

'అన్నంతపనీ చేసావన్నమాట! రాక్షసీ! ఇంకా ఎవ రామె అని అడుగుతున్నావా? నీలోని పిశాచత్వానికి బలి అయిన ఒక కుసుమకోమలి! ఆమె నిన్ను పీకనులిమి అవతల పారేసినా, స్త్రీహత్యాపాతకం నన్ను చుట్టుకోదు." సరళకి 'జీవా' ధోరణి అసహనం కలిగించింది. ఆమె ఇంటికి అతిథిగా వెళ్ళి ఆమెని తూలనాడటం ఏమంత గౌరవప్రదం? జీవాకి ఆమెపట్ల కోపం ఎందుకో, వాళ్ళ గతచరిత్ర ఏమిటో ఆమెకి తెలీటంలేదు.

'ఏమిటండీ ఈ గొడవ? మనింటికి పోదాం పదండి. మీఅన్నగారు వచ్చేవేళయ్యిందికూడా!' నింపాదిగా అనునయింపుగా అన్నది సరళ.

'నేను భరించలేను. ఇప్పుడే అంతా చెప్పేస్తాను. అన్నాడు జీవా.

'నేను చెప్పొద్దని బ్రతిమాలితే నీకు బ్లాక్ మెయిల్ చెయ్యటానికి అవకాశం యిచ్చినట్లవుంది' నిబ్బరంగా అంది బాజీ.

'పదండీ ప్లీజ్! ఏమిటీ గొడవ అనవసరంగా' చేసేది లేక జీవాని చేయిపుచ్చుకుని తనింటికి తీసుకువచ్చింది. జీవా ఇంటికి వచ్చి గ్లాసెడు మంచినీళ్ళు పుచ్చుకుని స్థిమితపడ్డాడు.

'మీరు ధైర్యంగా వుండాలి వదినా' అన్నాడు జీవా.

'నాకంత అధైర్య పడాల్సిన పరిస్థితులేమీ లేవే!' అంది సరళ.

మీలాంటి నిర్మలచరిత్రగల యువతిని ఎలా వంచించ బుద్ధిపుట్టుందో నాకర్థం కావటకలేదు వొదినా. ఈ బాజీ వుంది చూసారూ! వుట్టి దగుల్బాజీరకం. అది మన రాజేంద్రని చెంగుకు కట్టుకుని త్రిప్పుకుంటుంది అనుకోండి' అన్నాడు జీవా.

"ఛ, చ! ఎంతమాట! ఆయనకి వాళ్ళ పొడఅంటేనే గిట్టదు" నమ్మలేనట్లు అంది సరళ.

"మీ ఎదురుగా అదంతా నటన! మీతో అసలు వివాహానికి బాజీయే రాజేంద్రని ప్రోత్సహించింది" దృఢంగా అన్నాడు.

'అయితే వుట్టి అమాయకురాలన్నమాట! చెజేతులా ప్రియుణ్ని పెళ్ళికి వొప్పించే స్త్రీలు వుంటారా? ఎక్కడన్నా హేళనగా అంది సరళ.

'వుట్టి అమాయకులు మీరు వొదినా. అలనాడు కైక దశరథుణ్ని రెండువరాలతో ఎల్లా కట్టేసుకుందో, ఈనాడు 'బాజీ' కూడా అట్లా రెండువరాలతో మన రాజేంద్రుని కట్టేసికుంది అందులో మొదటివరం, మిమ్మల్ని పెళ్ళాడటం!

'రెండోది?' కౌతుకంగా అడిగింది, సరళ.

"మీ యావదాస్తికీ తన కూతురు వారసురాలు కావటం!' పైప్ వెలిగించాడు డాక్టరు జీవా

'అదెల్లాసాధ్యం? మరి నాకు పిల్లలు కలిగితే, ఆమెకి మిగిలేదేమిటి?' ఆదుర్దాగా అంది సరళ.

'మీకు పిల్లలు కలుగరు అని ఆమెకి తెలుసుకద!'

'అదే! ఆ హామీ ఏమిటీ అని?' గట్టిగా, విసుగ్గా అంది సరళ.

'ఆమె కోరిక ప్రకారం మీ పెళ్ళికి ముందే ఆపరేషన్ చేయించుకున్నాడు రాజేంద్ర.' పైప్ గట్టిగాపీల్చాడు జీవా.

'ఆఁ!' కెవ్వుమంది సరళ.

అప్పుడే ఆఫీసునుంచివొచ్చి గుమ్మంలో నించున్న రాజేంద్రుని వెనుతిరిగిచూసింది. ఆమెకళ్ళు పెద్దవయ్యాయి. గబగబా రాజేంద్రవెంపు వెళ్ళి అతని రెండుభుజాలూ పుచ్చుకుని గట్టిగా వూపుతూ, 'నిజంచెప్పండీ! మీరెవరు? మీకు

నే నేం అపకారంచేసాను ! ఆమె ఎవరు ?' అంటూనే హఠాత్తుగా, రాజేంద్రభుజాలు వదిలేసి రోడ్డుమీదకు పరిగెట్టింది. రాజేంద్ర ఆమెని బలంగా చేతులతో చుట్టేయబోయాడు. ఒక్క విదిలింపుతో ఆమె అతన్ని వెనక్కి నెట్టి రోడ్డుమీదకు పరిగెట్టింది.

రాజేంద్ర గాభరాగా స్కూటర్ తీసుకు బయలు దేరాడు.

అతను, సరళ వెనకాతల వెళ్ళటం, కిటికీలోంచి జుత్తు విరబోసికొన్న 'బాజీ' చూస్తూనేవుంది.

* * *

## "లిల్లీ మామా"

పార్కులోకివచ్చి ఉత్తరపుమూలనున్న బెంచీమీద కూర్చుంటూనే యెదుటి బెంచీమీదికి చూసాడు రాంసింగ్. బెంచీ ఖాళీగా, బిక్కగా సూసింది రాంసింగు వెంపు.

"ప్చ ! ఇవ్వాళా రాలేదు!" అనుకున్నాడు నిర్వేదంగా రాంసింగ్. పార్కు అంతా సందడిగావుంది. పిల్లలు జట్లుజట్లుగా చేరి దాగుడుమూత లాడుకుంటున్నారు. కొత్తగా పెళ్ళయిన జంటలు, పరిమళాలు వెదజల్లుతున్న పూలపందిళ్ళ మాటున స్వప్నావశిష్టులై కూర్చున్నారు. పనీపాటాలేని యువకులు, పార్కు అంతా అలగం తిరుగుతూ, తరుణయువతులు ఒంటిగా వున్నప్పుడల్లా తమ భావకవిత్వాన్ని చదువుతూ, మురుస్తున్నారు.